ప్రజాశక్తి
శనివారం 22 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



25న పాలకొండలో మెగా జాబ్‌మేళా

పార్వతీపురం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న పాలకొండలో సంకల్ప్ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకుని 18 ఏళ్లు నిండి 29 ఏళ్లలోపు గల నిరుద్యోగ యువత ఈ మేళాకు హాజరు కావచ్చని అన్నారు. పాలకొండలోని శ్రీ సత్య సాయి డిగ్రీకాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఈ జాబ్ మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని అన్నారు. కావున ఆసక్తి గల యువత తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు బయోడేటా, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 63012 75511, 79937 95796 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని వివరించారు.

జీడికి అగ్గి తెగులు... రైతుకు దిగులు

ప్రజాశక్తి - సీతంపేట

ఆరుగాలం శ్రమించి పంటచేతికొచ్చే సమయంలో చేయి జారిపోవడంతో జీడి రైతులు లబోదిబోమంటున్నారు. గిరిజనుల అటవీ ఉత్పత్తుల్లో ప్రధానమైన ఆర్థిక వనరు జీడి. అలాంటి పంట మరో రెండు వారాల్లో ఇంటికి వచ్చే సమయంలో అగ్గి తెగులు సోకి జీడి రైతుల ఆశలను నిరాశ చేసింది. సీతంపేట ఏజెన్సీలో గిరిజనులు జీడి పంటపై ఎక్కువగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏజెన్సీలో 17,839 ఎకరాల్లో 13,357 మంది రైతులు జీడిని సాగు చేస్తున్నారు. జీడి రైతులకు ఎకరాకు 25 వేల వరకు ఏడాదికి ఖర్చు అవుతుంది. కొమ్మ కటింగు, డొంకలు కొట్టడం చుట్టూ శుభ్రం



అగ్గితెగులు సోకి మాడిపోయిన జీడిచెట్టు

చేయడం, ఎరువు వేసి వేపుగా పెంచడం వంటివి సస్య రక్షణ చేశారు. గురండి, ఈతమానగూడ, పుట్టిగాం, నెల్లిగండి, దుమ్మంగివలస, కోమటిగూడ,

లబో దిబోమంటున్న గిరిజనులు

బంజారు గూడ పరిసర గ్రామాల్లో జీడి పంటకు అగ్గి తెగులు సోకడంతో పంట పూర్తిగా మాడి మసైపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పూతికవలస, పివి ఈతమానగూడ పంచాయతీ పరిసర ప్రాంతాల్లో జీడికి అగ్గి తెగులు సోకి సుమారు 200 ఎకరాల వరకు నష్టం జరుగుతుందని రైతులు వాపోయారు. జీడి పంటకు అగ్గి తెగులు సోకినప్పుడు ఆకులు రాలిపోవడం, పువ్వు కాలిపోయిమాడి మసైపోతుంది. కొన్నిచోట్ల అవసరమైతే చెట్టు రాను రాను ఎండిపోయి చనిపోతుంది. దీంతో రైతులు కుదేళవుతారు. ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన జీడి రైతులకు పరిహారం చెల్లించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రంగా నష్టపోయా...



నాకున్న ఎకరా 50 సెంట్లు జీడి తోటకు అగ్గి తెగులు సోకడంతో తీవ్రంగా నష్టపోయాను. ఇప్పటికే రూ.40 వేల వరకు ఖర్చు అయింది. ఈ సమయంలో అగ్గి తెగులు రావడంతో కుదేలు అయిపోయాను. ఏప్రిల్‌లో పంట చేతికొస్తుందన్న ఆశను అగ్గి తెగులు నిరాశ చేసింది.

పత్తిక వీరన్న, సర్పంచ్
పివి ఈతమానుగూడ పంచాయతీ

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

జీడి పంటకు అగ్గి తెగుళ్ల వంటివి వచ్చిన రైతులు వినతులు ఇస్తే ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తాం. వారి సూచనలు మేరకు చర్యలు తీసుకుంటాం. అలాగే జీడి రైతులు ఎకరాకు రూ.1600 బీమా చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాలు, ఈదురు గాలులు, గాలి వానలు, అగ్గి తెగుళ్ల వంటి అధిక ఉష్ణోగ్రతలు దాటి ఉన్నప్పుడు బీమా చెల్లించిన రైతులకు పరిహారం వర్తిస్తుంది.

పి.జయ శ్రీ
హార్టికల్చర్ అధికారి, సీతంపేట

జీడి రైతుకు నష్టపరిహారం చెల్లించాలి



అగ్గి తెగులు, తేనెమంచు, ఈదురు గాలులు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన జీడి రైతులకు సర్వే చేపట్టి పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలి .

ఆరిక భాస్కరరావు,
సిపిఎం మండల కార్యదర్శి, సీతంపేట.

ఫారం పాండ్స్‌పై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఫారంపండ్స్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల అధికారులను ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమంపై రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా కలెక్టర్లు, డ్వామా పీడీలతో శుక్రవారం సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం మండల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పల్లె పండుగ పనులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. కావున జిల్లాలో పల్లె పండుగ కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా వీలైనన్ని ఎక్కువ ఫారంపాండ్లను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, కావున అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు మినీ గోకులాలు, ప్రహరీ గోడలు, రహదారులకు ప్రాధాన్యతని ఇస్తూ, వాటిని పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రేపు ఉల్లాస్ అర్హత పరీక్ష

అక్షరాస్యత అర్హత పరీక్ష ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉల్లాస్ పోస్టర్‌ను విడుదల చేశారు. "ఉల్లాస్ కార్యక్రమం" మన్యం జిల్లాలో గతేడాది నవంబరు 15న ప్రారంభించామని, ఈ కార్యక్రమంలో భాగంగా వయోజనులకు చదవడం, రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయగలగడం నేర్పించామని, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత ఇతర జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేయొచ్చు అన్నారు. పౌరులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జిలో చదువు రాని 22,944 మందిని అభ్యాసకులు గాను, చదవుకున్న 2,294 మందిని వాలంటరీ టీచర్స్‌గా గుర్తించామని తెలిపారు. టిసిఎస్ తయారు చేసిన వీడియో ఆడియో లెసన్స్ ద్వారా ఉల్లాస్ పాఠాలు బోధించామన్నారు. ఈనెల 23న ఎఫ్ఎల్ఎన్ఎటి పరీక్ష నిర్వహిస్తున్నా మని, ఈ పరీక్ష చదవడానికి 50 మార్కులు, రాయడానికి 50 మార్కులు, గణితానికి 50 మార్కులు చొప్పున 150 మార్కులకు ఉంటుందని అన్నారు. ఈ టెస్ట్‌లో 33 శాతం పొందిన వారిని ఉత్తీర్ణులుగా గుర్తించి వారికి ఎన్ఐఓఎస్ ద్వారా ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఈ ఎఫ్ఎల్ఎన్ఎటి టెస్ట్ జిల్లాలో గుర్తించిన స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాలలో మొత్తం 844 కేంద్రాలలో నిర్వహిస్తా మని, అంగన్వాడీ కార్యకర్తలు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారని, ఈ టెస్ట్ కు సంబంధించిన మెటీరియల్ అన్ని మహిళా సమాఖ్య కేంద్రాలకు చేరవేశామని చెప్పారు.



ఉల్లాస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు



శంబరలో ప్రజాచైతన్యయాత్ర నిర్వహిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, నాయకులు

అన్యాక్రాంత భూములను పేదలకు పంచాలి

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

పేదలు సాగు చేస్తున్న డి-పట్టా భూములను. అన్యాక్రాంతం చేసిన వారిపై చర్యలు తీసుకొని పెత్తందారులు ఆక్రమించుకున్న భూములను పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ఆయనతో పాటు సిపిఎం నాయకులు ప్రభాకర్, సింహాచలం, గోపి, చంటి శంబర, మూకవలస, మోసూరువలస, తూరుమామిడి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ శంబరలో 25 ఎకరాల డి-పట్టా పేదల భూములను పెత్తందారులు ఆక్రమించుకున్నారని, వెంటనే ఆ భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తూరుమామిడిలో 20 ఎకరాల డి-పట్టా భూములను పెత్తందారులు ఆక్రమించుకున్నారన్నారు. అలాగే అన్యాక్రాంతమైన భూములను వెంటనే పేదలకు పంపిణీ చేసేలా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో సాగు చేస్తున్న పేదల భూములకు నేటికీ పట్టాలివ్వకపోవడం వల్ల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు తహశీల్దార్ కార్యాలయానికి వినతులిచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 24న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి పేదలంతా కదలి రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇప్పటికైనా పేదలకు భూములు పంపిణీ చేయాలని, సాగు చేస్తున్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరిన్ని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, గిరిజనులు, దళితులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో శాంతి భద్రతల నిర్వహణకు విశేష కృషి చేస్తున్న పోలీసు సిబ్బంది శాఖ పరమైన, సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను స్వయంగా విన్నవించుకున్నారు. సిబ్బంది విన్నవించుకున్న సమస్యలను ఎస్పీ కూలంకుషంగా విని, విన్నపాలను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. ఫిర్యాదులపై అధికారులతో ఎస్పీ మాట్లాడి పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిసి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



సిబ్బంది నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

టెన్త్ పరీక్షలకు 49 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డిఇఒ డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 10,363 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 10,314 మంది హాజరయ్యారని, 49మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని వివరించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష సజావుగా నిర్వహించామన్నారు. 31 పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షక బృందం, 6 కేంద్రాల్లో తాను సందర్శించినట్టు తెలిపారు.

ఏకలవ్య పాఠశాల ఉద్యోగిపై దాడి?

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణం లోని కురుపాం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో పని చేస్తున్న ఒక ఉద్యోగి పై ఓ విద్యార్థి తండ్రి దాడి చేసినట్లు తెలిసింది. పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారనే ఆవేదన తో ఆ విద్యార్థి తండ్రి ఉద్యోగిపై దాడికి పాల్పడ్డారని సమాచారం. దీంతోజిల్లా విద్యాశాఖ అధికారులు, పోలీసులు, గిరిజన సంఘాల నాయకులు రంగప్రవేశం చేసి పాఠశాల లో ఉద్రిక్త పరిస్థితి ని నియంత్రించారు.పాఠశాలలో బోధనా సిబ్బంది లో 90శాతం ఉత్తర భారత దేశానికి చెందిన వారు కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయలోపం కనిపిస్తోంది. దీని వల్ల విద్యార్థులపై ఉపాధ్యాయుల నియంత్రణ లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే పాఠశాల లో గతంలో కొన్ని అనూహ్య సంఘటనలు చోటు చేసుకున్నాయి.



గిరిజన భూముల్లో పాతేందుకు ఒడిశా అధికారులు తెచ్చిన స్తంభాలు

ఒడిశా అధికారుల దౌర్జన్యాలు ఇంకెన్నాళ్లు : సిపిఎం

ఎగువ శెంబిలో గిరిజన భూముల్లో సర్వేరాళ్లు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆంధ్రా - ఒడిస్సా వివాదాస్పద గ్రామాల్లో నిత్యం ఒడిస్సా అధికారులు ఏదో ఒక కారణంతో వివాదం సృష్టిస్తూ అక్కడ స్థానిక గిరిజనులపై దౌర్జన్యాలు చేస్తున్నా ఇక్కడ ప్రభుత్వం మాత్రం పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు విమర్శించారు. దశాబ్దాలు కాలంగా ఇక్కడ అపారమైన ఖనిజ సంపదలు ఉండడంతో వాటిపై కన్నేసిన ఒడిస్సా ప్రభుత్వం వారి పోలీసులతో స్థానిక గిరిజనులను అనేక విధాలుగా ఇబ్బందుతు పెడుతున్నా ఇక్కడి ప్రభుత్వాలు గానీ, పాలకులు గానీ కనీసం స్పందించడం లేదన్నారు. గతేడాది ఏప్రిల్1న సెంబి గ్రామంలో మైనింగ్ పేరుతో గిరిజనులు సాగు చేస్తున్న భూములుపై ఒడిశా అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆ సందర్భంలో స్థానిక గిరిజనులంతా ఒడిశా అధికారులు, పోలీసులకు ఎదురు తిరిగి అక్కడికి వచ్చిన రిగ్గు లారీలను, సామగ్రిని తిరిగి తీసుకెళ్లేలా చేశారని తెలిపారు. మళ్లీ శుక్రవారం పోలీసు బలగాలతో ఎగువ సెంబికి చెందిన తాడంగి సన్నం తదితరుల భూములుపైన మైనింగ్ కోసం ఒడిశా అధికారులు దౌర్జన్యం చేస్తూ సరిహద్దు రాళ్ళు వేయడం భూమి పూజలు చేయడం సరికాదని తెలిపారు. దీనిపై ఒడిశా అధికారులను, పోలీసులను నిలదీయగా గిరిజనులపైన దౌర్జన్యం చేస్తూ ఇక్కడ ఏమీ చేయడానికి లేదని, ఈ భూముల్లోకి రాకూడదని బెదిరించి ఫోన్ లాక్కోవడం సరికాదని తెలిపారు ఈ ప్రాంత మంతా ఐదో షెడ్యూల్ గ్రామాలుగా ఉన్నాయని, సర్వహక్కులు స్థానిక గిరిజనులకే చెందుతాయని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఎటువంటి హక్కు లేదని తెలిపారు. ఇక్కడ భూములను ఆక్రమించుకొని మైనింగ్ నిర్వహించేం దుకు ప్రయత్నిస్తున్న ఒడిశా ప్రభుత్వాన్ని అడ్డుకొని స్థానిక గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. కొట్టియా సరిహద్దు వివాదం పరిష్కారం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సలహాలివ్వండి : డిఆర్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లలో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని డిఆర్ఒ కె.హేమలత వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. అలాగే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు బిఎల్ఒలకు సంపూర్ణ సహకారం అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన ఛాంబరులో శుక్రవారం డిఆర్ఒ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు 800-1200 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియలో ఓటర్లకు 2 కిలోమీటర్ల లోపల పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో ఓటర్లకు అనువుగా ఉండే ప్రాంతాలను గుర్తించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆమె కోరారు. రాజకీయ పక్షాలు గుర్తించిన పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి దష్టికి తీసుకురావాలని చెప్పారు. అలాగే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి వివరాలను అందజేస్తూ బిఎల్ఒలకు సంపూర్ణ సహకారం అందించాలని అన్నారు. మీరిచ్చే సలహాలు,సూచనలు, సహకారంతో తప్పులు లేని నాణ్యమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా సిద్ధం కాగలదని, అలాగే నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కాగలవాని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందజేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ (సిపిహెచ్‌సి) శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యంతో గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. స్టాఫ్ నర్స్, ఎఎన్ఎంలకు సిపిహెచ్‌సి శిక్షణా కార్యక్రమాన్ని బ్యాచ్‌ల వారీగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ పలు రకాల వ్యాధులకు గల మూల కారణాలు, వాటి నివారణోపాయాలు, ప్రాథమిక, అత్యవసర వైద్య సేవలకు సంబంధించి ఆరోగ్య సమస్యలను గుర్తించే విధానం, చికిత్స, నివారణా చర్యలపై శిక్షణ ద్వారా సమగ్రంగా తెలుసుకొని ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్ర స్థాయిలోనూ వైద్య సేవలు మరింతగా విస్తృతం చేసి, వ్యాధులు ప్రబలకుండా కృషి చేయాలని అన్నారు. గర్భిణీ, శిశు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలాన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు పలు ఆరోగ్య అంశాలపై శిక్షణ ఇచ్చారు. నోటి సంబంధిత వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, దృష్టి సమస్యలు, మానసిక ఆరోగ్యం, రుగ్మతలు, నరాల సంబంధిత వ్యాధులు, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, అత్యవసర ప్రాథమిక వైద్యంపై వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది జగన్నాథం,యోగీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదలింగి పిహెచ్‌సిని డిఎంహెచ్‌ఒ తనిఖీ

కొమరాడ : మండలంలోని మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, లేబొరేటరీ, మందుల నిల్వలు, వార్డు, లేబర్ రూమ్ పరిశీలించారు. ఈ నెలలో ఎన్ని జ్వర నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు, రక్త పరీక్షలు చేయు పద్ధతి, వాటి నివేదికలు ల్యాబ్ రికార్డులో తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. ఒఆర్ఎస్ ప్యాకెట్ల లభ్యత పరిశీలించారు. పిహెచ్‌సి ప్రసవాలపై ఆరా తీసారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు నమోదు తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది అన్ని వేళలా పిహెచ్‌సీలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

గిరిజన సమస్యలపై 29న ధర్నాలు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సమస్యలపై ఈనెల 29న కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో గిరిజనులంతా పాల్గొని జయప్రదం చేయాలని గిరిజన సంఘం నాయకులు కామయ్య, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన గోడ పత్రికలు కొమరాడలో శుక్రవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన జీడి రైతులను దళారీల నుంచి రక్షణ కల్పించేలా గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. 80 కేజీల జీడి పిక్కల బస్తాలు రూ.16 వేలకు కొనుగోలు చేయాలని, ఇతర పంటలకు గిట్టు ధర కల్పించేలా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గిరిజన గ్రామాలకు బస్సు, మంచినీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, నిరుపేదలకు ఇల్లు స్థలంతో పాటు ఇల్లు ఇవ్వాలని, గిరిజనుల ఉన్నత చదువు కోసం పీజీ కాలేజీ ఏర్పాటు చేయాలని, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, వంద పడకల హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాలని, అలాగే 3,4,5 తరగతుల విద్యార్థులను చదువుకు దూరం చేసేలా మోడల్ స్కూల్ విధానాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ సమస్యలపై ఈనెల 29న తలపెట్టిన కలెక్టరేట్ ధర్నాలో గిరిజన ప్రజానీకం అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన రైతులు యువకులు పాల్గొన్నారు.

సీతంపేట : గిరిజన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న స్థానిక ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీడీకి మద్దతు ధర ప్రకటించాలని, మినీ రిజర్వాయర్లను పూర్తి చేయాలని, ఆసుపత్రుల పనులను పూర్తి చేయాలని, తదితర సమస్యలపై ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. కావున ఈ ధర్నాలో గిరిజన రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జె.శ్రీరాములు, ఎ.గంగాధర్, ఎం.కాంతారావు, పి.సాంబయ్య, బి.నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.



సీతంపేటలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

అంగన్వాడీ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 17 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి కనకదుర్గ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో రెండు సహాయకులు పోస్టులు, సాలూరు ప్రాజెక్టు పరిధిలో మూడు సహాయకుల పోస్టులు, బలిజిపేట ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త పోస్టు, మూడు సహాయకులు పోస్టులు, సీతానగరంలో రెండు సహాయకులు పోస్టులు, పాలకొండ డివిజన్‌లో పాలకొండలో మూడు సహాయకులు పోస్టులు, భామిని ప్రాజెక్టు పరిధిలో రెండు సహాయకులు పోస్టులు, వీరఘట్టం లో ఒక సహాయకులు పోస్టు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని ఆమె చెప్పారు. ఈ ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. స్థానిక స్థిర నివాసం కలిగిన అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. దరఖాస్తులను ఈనెల 31లోపు సంబందిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

అంగన్వాడీలకు అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పోషణ బి - పడాయి బి పై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కనకదుర్గ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు జరిగిన అవగాహన కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేస్తున్న పోషణ బి- పడాయి బి శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు మెరుగ్గా అందించాలని సూచించారు. ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల వెలుగు కార్యాలయం వద్ద 50మంది అంగనవాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు వారి ఆరోగ్య జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. ఐసిడిఎస్ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఎన్.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ సాల్మన్ రాజ్, సూపర్వైజర్లు ఈశ్వరమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

పాము కాటుకు గురైన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రావాడ రామభద్రపురానికి చెందిన బిడ్డిక వెంకటి తన ఇంటో నిద్రిస్తున్న సమయంలో పాము కాటేసింది. వెంటనే ఆయన్ను చినమేరంగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.


చీఫ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. పరీక్షా కేంద్రంలో ఇబ్బందులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఆయనతో పాటు స్థానిక ఎస్సై జి.కళాధర్, సిబ్బంది ఉన్నారు.

సీతంపేట : మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతి నాయుడు తనిఖీ చేపట్టారు. దోనుబాయి, సీతంపేట, హడ్డుబంగి ఎపిఆర్ మల్లి పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయనతో ఎంఇఒ ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు అన్నారు. స్థానిక గురుకుల బాలురు పాఠశాలలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి ఆన్లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు గడువు మార్చి 25తో ముగుస్తుందని అన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశానికి అర్హులని అన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకొని పరీక్ష సమయానికి హాజరు కావాలని కోరారు.

పిల్లల పట్ల జాగ్రత్తలపై శిక్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

అంగన్వాడీ కార్యకర్తలు కేంద్రాలకు వచ్చే ప్రీ స్కూల్ పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో శుక్రవారం పోషణ బి, పదాయ్ బి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలన్నారు. పోషకాహారం అందక పిల్లలు ఏ విధమైన స్థితిలో ఉన్నారన్నది అంతర్జాలంలో స్క్రిప్ట్ ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు వీక్షించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ బి.సిమ్మాలమ్మ, సూపర్వైజర్లు జె.జ్ఞానమ్మ, ఎన్.రాజేశ్వరి, ఎపిఒ జి.సత్యంనాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - కురుపాం :

గ్రామస్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై యూనియన్ నాయకులు శనపతి కార్తీక్, మనోజ్, నాగరాజు, మహేష్ తదితరులు శుక్రవారం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు కలెక్టరేట్లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్టిపుల్ డిపార్ట్మెంట్‌తో పనిచేయడం వల్ల తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నామన్నారు. కావున మల్టిపుల్ డిపార్ట్మెంట్ నుంచి తప్పించి సంబంధిత ఇంజినీరింగ్ శాఖలో విలీనం చేయాలని కోరుతూ కలెక్టరు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారికి వినతి పత్రం అందజేశామన్నారు.

మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గల పలు హోల్‌సేల్ మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆశ, విజిలెన్స్, స్పెషల్ బ్రాంచ్, లోకల్ పోలీసులతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మందుల షాపులలో 32 రకాల నిషేధిత మందులను విక్రయించకుండా ఉండేందుకు, వాటిని ప్రజలు వాడకుండా ఉండేందుకు, వైద్య పోలీస్ శాఖలను కోరడంతో, పోలీస్ శాఖ ఐజి ఆర్కే రవికృష్ణ ఆధ్వర్యంలో ఈగల్ బందం (విజిలెన్స్, ఎస్బి ,డ్రగ్స్, పోలీస్ అధికారులు ఈవిల్ బందం) రాష్ట్రంలోనే ఏకకాలం మందుల షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్బిసిఐ రమేష్, మన్యం జిల్లా ఈగల్ ఇన్చార్జిలతోపాటు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి మాజీ ఉద్యోగికి ఎస్‌పి కితాబు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

దొరికిన బంగారు వస్తువు(చైన్)ను ఎస్పీకి అందజేసిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీని ఎస్పీ ఎస్ మాధవరెడ్డి అభినందనలు తెలియజేయడంతో పాటు నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణానికి చెందిన విశ్రాంత ఆర్‌టిసి డ్రైవర్ పుప్పాల చంద్రరావు వైకెఎం కాలనీలో ఆంటీ టిఫెన్ సెంటర్ వద్దకు టిఫెన్ కోసం వెళ్లగా అక్కడ బంగారు వస్తువు(చైన్) పడివుండడం గమనించి దాన్ని తీసి చుట్టుపక్కల వున్న వ్యక్తులు ఎవరైనా పడేసుకున్నారేమో అని వాకబు చేశారు. సమాచారం లభించకపోవడంతో టిఫెన్ షాప్ యజమానికి, చుటుపక్కల వారికి ఎవరైనా బంగారు వస్తువు పోగొట్టుకున్నామని అడిగితే తన సమాచారం ఇవ్వమని వారికి తెలిపారు. సదరు వస్తువును పోగొట్టుకున్న వారి ఆచూకీ తెలుసుకొని వారికి అందజేయాలని కోరారు. దొరికిన బంగారు వస్తువు(చైన్)ను అందజేసిన చంద్రరావు ఎస్పీ మాధవ్ రెడ్డి అభినందిస్తూ, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు.

జాబ్‌మేళాకు 54 మంది హాజరు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. సీతంపేట వైటిసిలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 54 అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 35 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారు సోమవారానికి కంపెనీలో జాయిన్ కావాలని అన్నారు. కార్యక్రమంలో స్కిల్ కాలేజ్ కోఆర్డినేటర్ వెంకట రమణ, కంపెనీల హెచ్ఆర్ లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రతి పల్లెలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డిఎల్‌పిఒ నాగభూషణం తెలిపారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించి ఆ చెత్తను సంపద కేంద్రానికి తరలించడంతో పంచాయితీకి ఆదాయం చేకూరుతుందన్నారు గ్రీన్ అంబాసిడర్లు. గ్రీన్ గార్డులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాలు నిర్వహణ సక్రమంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు, గణపతి, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు పాల్గొన్నారు.

'ఉపాధి' పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ఆరువారాలగా పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేతనదారులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా స్థానిక నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శు పీసా వెంకటస్వామి, నల్ల ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ పనుల్లేక ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు సుమారు 6వేల మంది వలసలు పోయారని, వలసలు నివారించాలంటే తక్షణమే ఉపాధి హామీ పనులు కల్పించాలి అన్నారు. ఇప్పటి వరకు ఆరు వారాలు చేసినా పనులకు బిల్లులు రాలేదని, తక్షణమే బిల్లులు చెల్లించాలని, ఫారం ఫాండ్ తదితర పనులు కాకుండా ప్రజలు ఏ పనులు అడిగితే ఆ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు ఒక్క పూట పనిచేయించించాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులైన తాగు నీరు, టెంట్లు, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని, మెట్లు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇఒపిఆర్‌డి పుష్పరాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు ఆవు సాంబమూర్తి, రైతు సంఘం నాయకులు బాదిలి జగన్నాథం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విశ్వేశ్వరరావు, శివరాం, లక్ష్మణ, అసిరయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ఉపాధి హామీ పథకం కింద ప్రతి నిరుపేదకు

ఎంపిడిఒ కార్యాలయం వద్ద కూలీల ఆందోళన

పనులు ఇవ్వాలని, బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద కూలీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఈరోజు వరకు పనిచేసిన 5 వారాలకు బిల్లులు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు పూట పని రద్దు చేయాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. నార్లవలస పంచాయతీ పరిధిలో కూలీలకు పనులు ఇవ్వాలని అడుగుతున్నా క్షేత్ర సహాయకులు పని ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, పనులు కోసం వెళ్లే వారికి కనీసం స్పందించడం లేదని, ఆయనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ జి.పార్వతికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కూనేటి చినబాబు, డప్పు కళాకారుల నాయకులు కొమ్ము అప్పారావు, నాగేశ్వరరావు, శ్రీను, నర్సింగరావు పాల్గొన్నారు.



బలిజిపేట ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వేతనదారులు

పార్వతీపురం రూరల్ : జిల్లాలో ఉపాధి పనులు చేసిన వారికి గత ఆరు వారాలుగా వేతనాలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే వారికి వేతనాలు విడుదల చేయాలని ఎపి గిరిజన సంఘం నాయకులు, రావికోన సర్పంచ్ రామస్వామి, రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి రమణమూర్తికి వినతి అందించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ మార్చి నెల ముగుస్తున్నప్పటికీ ఉపాధి వేతనదారులకు చేసిన పనికి వేతనాలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ఉపాధి పనుల్లో కేవలం ఫారం పాండ్స్ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల గ్రామాల్లో భూములు గల రైతులు ఫారం పాండ్స్‌పై ఆసక్తి చూపకపోవడంతో వేతనదారులకు పనులు కరువవుతున్నాయని తెలిపారు. దీంతో వలసలకు తరలి వెళ్లే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు పరిస్థితి గ్రహించి వేతనదారులు కోరిన చెరువు, కాలువ పనులతో పాటుగా వారు అడిగిన పనులు మంజూరు చేయాలని అధికారులను కోరారు.


కమిషనర్‌కు ప్లాస్టిక్ కవర్లు అందజేస్తున్న దుకాణదారుడు

ప్లాస్టిక్ నివారణకు సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్లాస్టిక్, పాలిథిన్ వాడకాల నివారణకు పట్టణ ప్రజలు, అన్ని వర్గాల వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఆయన ప్రజారోగ్య విభాగం అధికారులు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలతో కలిసి పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారుల దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని, స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. వ్యాపారులు తమ వద్ద ఉన్న పాలిథిన్ కవర్లు, ప్యాకెట్లను స్వచ్ఛందంగా కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, పాలిథిన్ వాడకాల వల్ల అన్ని వయసుల వారు క్యాన్సర్ బారినపడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని, ప్లాస్టిక్ పాలిథిన్ వాడకాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రాష్ట్రంలోనే ప్లాస్టిక్ నివారణకు చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా మన్యం జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ శ్యాం ప్రసాద్ కృషి చేస్తున్నారని, ప్లాస్టిక్ వాడకాల నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

డ్రోన్ల వినియోగంపై పోలీసులకు శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నేరాలను అరికట్టడంలో ఆధునిక సాంకేతిక వినియోగంపై పోలీసు శాఖ దృష్టి పెట్టడంతో పార్వతీపురం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లోని సిబ్బందికి డ్రోన్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను మండలంలోని వెంకంపేట క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ భాస్కరరావు మాట్లాడుతూ నేరాలు నివారణంలోనే కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రోన్లను వినియోగించుకుని శాంతిభద్రతలను కాపాడేందుకు సిబ్బందిని సంసిద్ధులను చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం, సాలూరు, సీతానగరం, పాచిపెంట, బలిజిపేట, పార్వతీపురం రూరల్, టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరోధించేందుకు డ్రోన్ పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రోడ్డు భద్రత విషయంలో ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ప్రతి ప్రయాణికుడు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే జంక్షన్ల వద్ద సీసీ కెమెరాలు అమర్చాలన్నారు.


కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పర్మినెంట్ కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకరరావు శుక్రవారం సిఐటియు జిల్లా నాయకులు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2008 నుంచి 2018 వరకు పిఎఫ్ ఖాతాలు మున్సిపల్ కమిషనర్ అకౌంట్‌లో లాగిన్ అయి ఉన్నాయని, దీన్ని వ్యక్తిగత లాగిన్‌కు ఓపెన్ చేయాలని అన్నారు. ఆప్కాస్ విధానంలో చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సెలవులు తక్షణం మంజూరు చేయాలని, రాత్రిపూట పనిచేసే కార్మికులకు కనీస వసతులు కల్పించాలని, మరమ్మతుల్లో ఉన్న పనిముట్లు బాగు చేయించాలని లేదా కొత్తవి కొనాలని అన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు మామిడి శివ, గుంట్రెడ్డి గంగరాజు, గుంపస్వామి, నాగవంశం, మల్లేష్, బంగారి రాజేష్, బంగారు రవి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

గృహ లబ్ధిదారులు పక్కా ఇళ్లను త్వరిగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఇంచార్జ్ ఇఇ సోమేశ్వరరావు, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ సూచించారు. మండలంలోని పెదబోగిలిలోని వైయస్సార్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ప్రస్తుతం ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ఇఇ తగు సూచనలు అందజేశారు. అనంతరం సోమేశ్వరరావు మాట్లాడుతూ పెద్దూరు కాలనీలో నిర్మిస్తున్న పక్కా గృహాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని ఎఇకి సూచించారు. గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సహాయాన్ని అందజేస్తుందన్నారు. అనంతరం గృహ నిర్మాణదారులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి సామాన్లు తెచ్చుకోవాలన్నా రాకపోకలు సాగించాలన్నా సరైన మార్గం లేదని దీంతోనే నిర్మాణాలు చేపట్ట లేకపోతున్నామని వాపోయారు ఇప్పటికైనా సరైన మార్గం ఏర్పాటు చేస్తే నిర్మాణాలు చేపడానికి తమకు ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం శ్రీరాములు, సిసి ఆనంద్, ఇంజినీర్ అసిస్టెంట్ సంతోష్, విఎఒ పి.సంధ్య, వర్కు ఇన్స్పెక్టర్ సురేష్, రామునాయుడు, లబ్ధిదారులు ఉన్నారు.


పెదబోగిలిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

దోమల నివారణకు చర్యలు చేపట్టండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సీజన్ కాని సీజన్లో పట్టణ ప్రజలను దోమలు వేధిస్తున్నాయని, వీటి నివారణకు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లును కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, నియోజకవర్గ చైర్మన్ సిరుసుపల్లి సాయి శ్రీనివాస్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని వార్డుల్లో గల మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలో 24/7 పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. దోమల నివారణకు ప్రతిరోజూ అన్ని వీధుల్లో ఫాగింగ్ చేయించాలన్నారు. ఎస్ ఎం 5% పిచికారి చేయించాలని, వరహాలు గడ్డలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. దోమల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ తక్షణమే దోమల నివారణకు చర్యలు చేపట్టి, పారిశుధ్య మెరుగుకు కృషి చేస్తానన్నారు..

పి-4 సర్వే పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పేద ప్రజలకు సంక్షేమ పథకాలు పక్కాగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పి-4 సర్వేను వార్డు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పక్కాగా నిర్వహించాలని ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ బివి ప్రసాద్ తెలిపారు. పి-4 సర్వేపై అవగాహన సదస్సును పట్టణంలోని కోటవీధి పరిధిలో గల నాలుగో వార్డు సచివాలయ, మెప్మా సిబ్బందికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబానికి ప్రభుత్వం నుండి ఏమి కావాలి, ఏ అవసరాలు ఉన్నాయన్న ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ పరిశీలించి డేటాను సేకరించాలని, దీనికోసం మున్సిపల్ పరిధిలో గల ఉద్యోగులు, వార్డు సచివాలయం సిబ్బంది, స్థానిక కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎస్‌వి ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, వార్డు సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లు మెప్మా సిబ్బంది,ప్రజా ప్రతినిధులు మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై నాణ్యమైన నువ్వు విత్తనాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేటలో సాగువుతున్న నువ్వు పంటను జిల్లా వ్యవసాయాధికారి (డిఎఒ) కె.రాబర్ట్ పాల్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నువ్వు పంటలు వేసవిలో సాగు చేస్తున్నామని 2-3 క్వింటాల్ దిగుబడి వస్తుందని తెలిపారు. మంచి రకాల విత్తనాలు సబ్సిడీ కావాలని రైతులు ఆయన్ను కోరారు. అనంతరం డిఎఒ మాట్లాడుతూ జిల్లాలో 5 నుండి 6 వేల ఎకరాల్లో నువ్వు పంట సాగు చేస్తున్నారని, తప్పకుండా మంచి రకాలు సబ్సిడీపై రాబోయే కాలాలకు అందిస్తామని తెలిపారు. అలాగే రైతులు నూర్పిడి యంత్రం కావాలని అడగ్గా, రూ.80వేలు సబ్సిడీ ఇస్తున్నామని, కావాల్సిన రైతులు ఈ నెలలో వ్యవసాయ అధికారిని కలవమని తెలిపారు. దీంతో పాటు రొటావేటర్లు, బ్యాటరి స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, పవర్ టిల్లర్, పవర్ వీడర్, దమ్ము సెట్టు, దుక్కి సెట్టు కూడా సబ్సిడీలో ఉన్నాయని, కావాల్సిన రైతులు వెంటనే విఎఎలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడతగా సబ్సిడీ యంత్ర పరికరాలు మంజూరు

పాచిపెంట : మండలానికి మొదటి విడతగా రూ.20 లక్షల సబ్సిడీ గల యంత్ర పరికరాలు మంజూరయ్యాయని, కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. ఇందులో 4 రోటవేటర్లు, పవర్ వీడర్లు 25, 60 స్ప్రేయర్లు, ఐదు పవర్ టిల్లర్లు, పవర్ స్ప్రేయర్లు, ఇతర పరికరాలు మంజూరు అయ్యాయని తెలిపారు. గరిష్టంగా 50శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. కావున చిన్న, సన్నకారు ఎస్‌సి, ఎస్‌టి, మహిళా రైతులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఐదెకరాలు దాటిన రైతుకు నిబంధనల ప్రకారం రాయితీ వర్తించదని తెలిపారు. ఈనెల 31 లోగా రైతులు నమోదు చేసుకుని వెంటనే ఆన్లైన్‌లో డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతు సేవా కేంద్ర వ్యవసాయ సహాయకులకు ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా నేరుగా ఆన్లైన్ పేమెంట్ సిస్టం ద్వారా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. తక్కువ సమయం ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. లేనిచో మంజూరైన రాయితీ వెనక్కి వెళ్లిపోతుందన్నారు. కావున విఎఎలు తొందరగా పని పూర్తి చేయాలని కోరారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని బొడ్డవలస పంచాయతీ పరిధిలో గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ వివాహిత మృతి వరకట్న వేధింపుల కేసుగా మారింది. మృతురాలి తండ్రి నాదెళ్ల దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్‌పి అంకితా సురాన ఆధ్వర్యంలో తహశీల్దార్ విజయలక్ష్మి బొడ్డవలసలో విచారణ నిర్వహించారు. నెల్లూరు జిల్లాకు చెందిన నాదెళ్ల సత్యశ్రీకి ఏడాది క్రితం ఏలూరు జిల్లాలో గూడపాటి సందీప్‌తో వివాహం జరిగింది. ఇందుకు గాను సందీప్‌కు రూ.20 లక్షల కట్నం, 30 కాసుల బంగారం కట్నంగా ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం వారు బతుకుతెరువు కోసం పార్వతీపురం మండలంలోని ఒక తోటను నిర్వహిస్తుండగా, అదనపు కట్నం కోసం తమ కుమార్తెను రోజూ అల్లుడు వేధిస్తూ ఉండేవాడని, ఈ వేధింపులు భరించలేక ఆమె గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని ఫిర్యాదు చేశారు. సందీప్, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదుదారు కోరినట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టి పై అధికారులకు నివేదిక పంపిస్తామని ఎఎస్‌పి అంకిత సురానా తెలిపారు.

పేదల సొంతింటికి హోలీ క్రాస్ చేయూత

ప్రజాశక్తి -భామిని

ప్రతి పేదవాడు సురక్షితంగా ఉండాలన్నా, సమాజంలో గౌరవం కావాలన్నా సొంత గృహం తప్పనిసరని, అధికంగా వెనుకబడిన వారికి సొంత ఇంటి కళ కలగానే మిగిలిపోతుందని హోలీ క్రాస్ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. మండలంలోని సింగిడిలో గల కల్యాణ మండపంలో, ప్రభుత్వం నుంచి గృహ మంజూరు, ఆర్థిక కారణాల రీత్యా పూర్తి చేయలేని ఆదివాసీ, ఇతర వెనుకబడిన 40 మంది గృహ లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆర్థిక కారణాల రీత్యా నిలిచిపోయిన మీ సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు హోలీ క్రాస్ సంస్థ చేయూతనిస్తుందని తెలిపారు. త్వరగా గృహ నిర్మాణం పూర్తవ్వడానికి తమ సంస్థ గృహ నిర్మాణ సామాగ్రిని ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. సమావేశంలో లబ్ధిదారుల గృహ నిర్మాణం ఏ స్థితిలో ఉందనే అంశాలు, తదుపరి అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

పిందె దశలో తెగుళ్లు సోకుతాయి

ప్రజాశక్తి - వీరఘట్టం

పిందే సమయంలో మామిడి పంటను అనేక రకాల తెగుళ్ళ, పురుగులు ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయని ఉద్యాన శాఖ ఎఒ టి.అమరేశ్వరి జీడి, మామిడి రైతులకు సూచించారు. మండలంలోని బిటివాడలో శుక్రవారం రైతులతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. సరైన నీటి, పోషక యాజమాన్యాలేక తోటల్లో పూత పిందే రాలడం, కాయ సైజు నాణ్యత తగ్గడం జరుగుతుందన్నారు. వీటి నివారణకు సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్యం చర్యలు చేపట్టడం ద్వారా దిగుబడులను నాణ్యతను పెంచవచ్చునని రైతులకు సూచించారు. ఖరీఫ్ సీజన్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాయకూరలు పంటలపై ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఎస్సీ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ ఎంటి సింహాచలం, ఎఫ్‌పిఒసిసి వై ఆనంద్, ఎఫ్ఎం కె.ధర్మారావు, గ్రామపెద్దలు లింగాల చంటి, జగదీష్, రైతులు పాల్గొన్నారు.

జీతాలు పెరిగేలా ఒప్పందాలు చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్ 102 వాహనాలకు ఈనెల 31తో టెండర్ గడువు ముగుస్తున్నందున సిబ్బంది జీతం కనీసం రూ.18500 ఉండేలా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోవాలని జిల్లా తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ సిబ్బంది సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 9ఏళ్లుగా రూ.7870 జీతాలకు పనిచేస్తున్న కెప్టెన్స్. అరకొర జీతాలతో భార్య పిల్లల్ని పోషించలేని దీనస్థితిలో కొనసాగుతున్నారని, కొత్త ఆర్థిక సంవత్సరంలో టెండర్లకు పిలిచినప్పుడు డ్రైవర్ల జీతాలను దృష్టిలో ఉంచుకొని కనీస జీతం రూ.18500 వచ్చేలా చూడాలని ఆ ప్రకటనలో కోరారు.

పాఠశాలను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని టికె రాజపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపిపి బొమ్మాలి భాను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాభ్యాసనలో బేసిక్ లెవెల్స్‌ను ప్రతి విద్యార్థిని అడిగి తెలుసుకుని తనిఖీ చేశారు. చదవడం రాయడం సంబంధించి వారి నోటుబుక్కులను పరిశీలించారు. పిల్లలు, టీచర్లకు సంబంధించి అటెండెన్స్, మధ్యాహ్నం భోజనం రిజిస్టర్లు పరిశీలించారు. ఉపాధ్యాయ సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి బి.సుధాకరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు ఫ్యాన్లు పంపిణీ

పజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎపి ఆర్ఎస్ గురుకుల పాఠశాలకు 20 ఫ్యాన్లు, 20 ట్యూబ్ లైట్లు, డిగ్రీ కళాశాల ఆశ్రమ పాఠశాల బాలుర వసతి గృహానికి 30 ఫ్యాన్లు, 30 ట్యూబ్ లైట్లు, బాలికల వసతి గృహానికి 20 ఫ్యాన్లు, 20 ట్యూబ్ లైట్లు పంపిణీ చేసినట్లు ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్ తెలిపారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల్లో రాత్రివేళ బస చేసిన అధికారులు విద్యార్థుల సమస్యలను గుర్తించి ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందజేసినట్లు ఆయన చెప్పారు.

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి జలాశయం నాలుగో గేటు వద్ద శుక్రవారం మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ రమేష్ నాయుడు తెలిపారు. పార్వతీపురం పట్టణానికి చెందిన ఆలవెల్లి రాజా (26) అని గుర్తించినట్టు తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

నిందితుడికి 12 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బిల్లుమడకు చెందిన మండల శివ 12ఏళ్లజైలు శిక్షను శ్రీకాకుళం జిల్లా పోక్సో కోర్టు విధించినట్టు బత్తిలి ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. బిల్లుమడకు చెందిన ఓ మైనర్ బాలికపై అఘాయిత్యానికి శివ పాల్పడినట్టు బాధితురాలి తండ్రి 2021లో ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి బత్తిలి పోలీస్ ఎస్ఐ పోక్సో చట్టం కింద శివపై నమోదు చేశారు. అనంతరం ఈ కేసును శ్రీకాకుళం జిల్లా దిశ పోలీస్ స్టేషన్ సిఐ లలిత కుమారి దర్యాప్తు చేసి, సదరు కేసులో ముద్దాయి అయిన శివపై ఫోక్సోకోర్టులో ఛార్జ్ సీటు దాఖలు చేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఈ కేసులో వాదోపవాదనలు విన్న కోర్టు వారు శుక్రవారం ముద్దాయి నేరం చేశాడని సాక్ష్యాలు ఉండడంతో పై శిక్ష విధిస్తూ న్యాయ స్థానం తీర్పునిచ్చిందని ఎస్ఐ తెలిపారు.